# ట్రిక్కు

నవనీతహారం ఇహ కొద్ది గంటల్లో వాళ్ల పుత్రికా రత్నమైన అపరంజి బొమ్మనుధారాదత్తం చేస్తాడనగా, మొగ పెళ్లివారు వింతవింత కోర్కెలు కోరుతూ ఆడపెళ్లివారిని ఆట పట్టిస్తున్నారు.

"ఎండాకాలం. నోళ్లెండిపోతున్నాయి. మాకు ఓ వంద లిమ్కాలు తెప్పించండి!" అని డిమాండు చేశారు.

పాపం, ఇప్పటికే ఓ మడిచెక్క అమ్మేశాడు. తను రిటైరయేక తనకు రావలసిన డబ్బుతో, తన అపరంజి బొమ్మ పెళ్లినిమిత్తం చేసిన అప్పు తీర్చాలి. సామాన్యమైన కుటుంబం. ఇప్పటికే ఓ యాభైవేలు కాబోయే అల్లుడుకి ధారపోశాడు. కొద్ది గంటల్లో ఇరవై ఏళ్లపాటు అల్లారు ముద్దుగా పెంచిన తన అపరంజి కన్యను ధారపోస్తాడు. వంద లిమ్కాలకి మూడు వందల రూపాయలు తెప్పించకపోతే కాబోయే అల్లుడు గార్కి కోపం వస్తుంది. ఏవిటి దారి?

గత్యంతరంలేక మూడు వందలూ ఖర్చు పెట్టి వంద లిమ్కాలు తెప్పించాడు. వంద లిమ్కాలు లాగించేసిన మొగ పెళ్లివారు బ్రేవుమని త్రేన్చారు.

మరో గంటపోయేక "అయ్యా! మాకు కొబ్బరి బొండాలు తెప్పించండి. నిన్నరాత్రంతా నిద్దర్లేదు. తెల్లవార్లూ పేకాట్లాడుకున్నాం. బాగా వేడి చేసేసింది!" అని మరో డిమాండు!

నవనీతహారం గుండె బేజారెక్కి పోయింది. ఏం చేయాలో తోచలేదు. వంద బొండాలకి మరో మూడొందలు కావాలి. బావ మర్దిని పిలిచి సలహా అడిగేడు.

"మీరేమీ దిగులు పడకండి బావ గారూ! ఆ సంగతి నాకొదిలేయండి" అని ధైర్యం చెప్పేడు బావమర్ది.

ఓ అరగంటలో కొబ్బరి బొండాలు సిద్ధమయాయి. మొగపెళ్లివారు బాగా సంతృప్తిపడ్డారు.

పెళ్ళి నిరాటంకంగా జరిగిపోయింది.

నవనీతహారం బావమర్దిని పిలిచి "నలుగురిలోనూ నా పరువు కాపాడేవ్వోయ్. కొంచెం కాలూ చెయ్యీ కూర్చుకున్నాక నీ మూడొందలూ ఇచ్చెస్తాను లేవోయ్!" అన్నాడు.

"అక్కర్లేదు బావగారూ! నాకు ముప్పయ్ రూపాయలివ్వండి చాలు. పది బొండాలే తెప్పించాను" అన్నాడు బావమర్ది.

"అదెలాగోయ్? పది బొండాలూ వంద మందికీ ఎలా సర్దేవ్వోయ్?'. చేద్యపడ్డాడు నవనీతహారం.

"చెబితే మీరు నన్ను కోప్పడతారు, నేచెప్పను" అన్నాడు బావమర్ది.

"ఫరవాలేదు" బుజ్జగించేడు నవనీతహారం.

"మరేం లేదండీ! ఓ పది కొబ్బరి బొండాలు తెప్పించేను. అవి మన పాలేరు చేత కొట్టించేసి, లిమ్కాలు తాగడానికి కొన్న 'స్ట్రా' లు వాటిలో పెట్టి తాగడానికి మొగ పెళ్లివారిలో ఓ పది మందికిచ్చేను. ఖాళీ చేసిన బొండాల్ని ఓ తట్టలో పెట్టి. వీదిలో పారేయమని, మరో పది బొండాలు కొట్టి తెమ్మని, మొగపెళ్లివారు వింటూండగా పాలేరుతో చెప్పేను. వాడేసిన పాత బొండాల్ని వాడొక రహస్య స్థలంలో పంచదార నీళ్లతో నింపి, మరో పది మందికి ఇచ్చేడు. ఇలా పది బొండాల్ని పది ట్రిప్పులు తిప్పడమే ట్రిక్కు!" అన్నాడు బావమర్ది.

22-3-1991

"ఆంధ్రభూమి" దినపత్రిక